ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

మంగళవారం 11 ఫిబ్రవరి 2025



న్యూస్ బాక్స్

నేటి నుంచి యథావిధిగా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు

పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి కాగజ్‌నగర్‌కు నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం నుంచి యథావిధిగా నడుస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఖమ్మం వద్ద మూడో లైన్ పనులు, ఇంటర్ లాకింగ్ పనులు నడుస్తు న్నాయని ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రైలును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఖమ్మం లో పనులు జరిగితే సికింద్రా బాద్- కాగ జ్‌నగర్ రూట్‌లో రైళ్ల రాకపోకలకు ఏమి ఇబ్బందని, ఎందుకు రద్దు చేస్తున్నారని ఉత్తర తెలంగాణ ఫోరం రైల్వే సభ్యులతో పాటు పలువురు ఎక్స్ వేదికగా రైల్వే అధికా రులను ప్రశ్నించారు. దీంతో ఈ నెల 15 వరకు రాకపోకలు కొనసాగుతాయని, అనం తరం నడిచేది తెలుపుతామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాట్నపల్లి సబ్‌స్టేషన్ ఆవ రణలో మంగళవారం ఉదయం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ వేణుగోపాల్‌చారి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ సమస్య లను ఆర్జీ రూపంలో సమర్పించాలని ఆయ న సూచించారు. వినియోగదారులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు.

దళితబంధు విడుదల చేయాలి

మంథనిరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి): గత ప్రభుత్వం మంజూరు చేసిన దళితబంధు నిధులను విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం మంథనిలో నిరసన ర్యాలీ నిర్వ హించారు. పాత పెట్రోల్ పంపు చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నినాదాలు చేస్తూ ఎంపికైన లబ్ధిదారులు ర్యాలీ నిర్వ హించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోయిల మహేష్, నేతలు రమేష్, తగరం శంకర్‌లాల్, కుమార్, మంథని లక్ష్మన్‌లు పాల్గొన్నారు.



కేశోరాం సిమెంట్ పరిశ్రమకు వాడుతున్న నీటిని పరిశీలిస్తున్న భూగర్భ జల శాఖాధికారులు



చీకురాయి రోడ్డులో సిమెంట్ సంచుల తయారీ పరిశ్రమలో నీటి వినియోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విచ్చలవిడి నీటి వినియోగానికి చెక్

- జీవో 15 అమలు చేసేందుకు ప్రయత్నాలు
- పరిశ్రమలు, కమర్షియల్ బోర్ కనెక్షన్లకు ఎన్‌వోసీ తప్పనిసరి
- లేకుంటే చర్యలు తీసుకోనున్న భూగర్భ జల శాఖ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని పరిశ్రమలు, వాణిజ్య, వ్యాపారపరంగా విచ్చలవిడిగా వాడు తున్న నీటి వినియోగానికి భూ గర్భ జల శాఖాధికారులు చెక్ పెట్టను న్నారు. జీవో 15ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారు. నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లేకుండా బోర్ వాటర్‌ను వినియోగి స్తున్న వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. విచ్చలవిడిగా భూగర్భ జలాలను వినియోగించకుండా ఉండేందుకు వాల్టా చట్టం 2004 ను కఠినంగా అమలు చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో 2023 మే 27న జీవో 15ను తీసుక వచ్చింది. ఈ జీవో ప్రకారం వ్యవసాయ, గృహ అవస రాలకు వేసిన బోర్లకు కాకుండా, పరిశ్రమలు, ఇతర వాణిజ్య, వ్యాపారపరంగా బోర్లు వేసి నీటిని వాడు తున్న యజమానులు తప్పని సరిగా నో అబ్జక్షన్ సర్టి ఫికెట్ తీసుకోవాలనే నిబంధన విధించింది. పరిశ్రమల పరంగా రైస్‌మిల్లులు, గ్రానైట్ క్వారీలు, సిమెంట్, గ్రానైట్ పరిశ్రమలు, క్రషర్లు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, హోటళ్లు, ఇటుక బట్టీ పరిశ్రమలు, ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్లు, ఫంక్షన్ హాళ్లు,

మిగతా 8వ పేజీలో...

● ఎన్‌వోసీ చెల్లింపులు ఇలా..

పరిశ్రమలు, ఇతరత్రా వాణిజ్య అవసరాలకు తీసుకునే ఎన్‌వోసీలను పలు కేటగిరీల ప్రకారం ఇవ్వ నున్నారు. వాటి గడువు ముగిసిన తర్వాత మళ్లీ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. క్రిటికల్ అండ్ సెమిక్రిటికల్ అండ్ సేఫ్ విభాగంలో ఉత్పాదక పరి శ్రమల్లో తాగడానికి, వాణిజ్య అవసరాలకు ఇచ్చే ఎన్‌వోసీ 5 సంవత్సరాల వరకు, పరిశ్రమలు, బల్క్ వాటర్ సప్లయ్, ప్యాకెజ్డ్ డ్రింకింగ్ సప్లయ్ చేసే వాళ్లకు 3 సంవత్సరాల వరకు, మైనింగ్ పరిశ్రమలకు 2 సంవత్సరాల వరకు, ఇతరత్రా అవసరాలకు ఎన్‌వోసీ 2 సంవత్సరాల వరకు గడువు ఉంటుంది. ఆ గడువు ముగిసిన తర్వాత నిర్ణీత రుసుం చెల్లించి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

ఉత్పాదక పరిశ్రమలకు కొత్తగా ఎన్‌వోసీ పొందాలనుకునే వారు రూ.10 వేలు, రెన్యూవల్ చేసుకున్నప్పుడు రూ.5లు చెల్లించాల్సి ఉంటుంది. పరిశ్రమలు, వాణిజ్య అవసరాలు, వాటర్ ప్లాంట్ల వాళ్లు నెలకు 25 వేల లీటర్ల నీటి వాడకానికి రూ.14,500, ఆపై 50 వేల లీటర్ల నీటి వాడకానికి రూ.18 వేలు, ఆపై లక్ష లీటర్ల నీటి వాడకానికి రూ.32 వేలు, లక్షకు పైగా నీటిని వినియోగించుకునే వాళ్లు రూ.42 వేలు చెల్లించాల్సి ఉంటుంది.

నాణ్యతను పరీక్షించి నివేదిక అందించాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించి నివేదిక అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో భూగర్భ జలాల సంచార నాణ్యత ప్రయోగశాల వాహనాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల శాఖ ఆధ్వర్యంలో నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద భూగర్భ జలాల నాణ్యత విశ్లేషణ కోసం సంచార నాణ్యత ప్రయోగశాల (మొబైల్ క్వాలిటీ ల్యాబ్ ఆన్ వీల్స్) ను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు. రామగుండం పరిసర ప్రాంతాలు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యతపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నీటి నాణ్యత పరీక్ష ప్రయోగశాల వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఎట్టకేలకు సింగరేణిలో డైరెక్టర్ల నియామకం

డైరెక్టర్(ఆపరేషన్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు

గోదావరిఖని, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఎట్టకేలకు ఇద్దరు డైరెక్టర్లను నియమించింది. సంస్థ ఆర్థికంగా, సాంకేతికంగా, నిర్వహణ పరంగా చర్చించి సంస్థ భవిష్యత్‌ను నిర్ణయించే డైరెక్టర్ బోర్డులో పదేళ్లుగా డైరెక్టర్ల కొరత కొనసాగుతోంది. సింగరేణి సంస్థకు చైర్మన్ అండ్ మేనే జింగ్ డైరెక్టర్(సీఎండీ)తో పాటు ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. ఆరు డైరెక్టర్ పదవుల్లో సత్యనారాయణరావు రెండు, సీఎండీ మిగతా డైరెక్టర్ పదవులు చూసుకుంటున్నారు. డైరెక్టర్లు లేకపోవడంతో కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని సంఘాల నాయ కులు పేర్కొంటున్నాయి. ఈ విషయమై ఈనెల 8న ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో ఇన్‌చార్జీల పాలనలో సింగరేణి అనే కథనాన్ని ప్రచురించింది.

ఈ క్రమంలో సింగరేణి సంస్థ ఇద్దరు డైరెక్టర్లను నియమించింది. సోమవారం సుమారు 10మంది సీనియర్ జీఎంలను సెక్రటేరియట్ పిలిపించుకుని నియామకాన్ని పూర్తిచేశారు. డైరెక్టర్(ఆపరేషన్)గా శ్రీరాంపూర్‌లో జీఎంగా పని చేస్తున్న ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్)గా అడ్రియాల జీఎం కొప్పుల వెంకటేశ్వరులను నియమించారు. వీరికన్నా సీనియార్టీలో ముందున్న మణుగూరు జీఎం రాంచందర్ డైరెక్టర్ పదవి వద్దని తప్పుకోవడంతో ఈ ఇద్దరికి అవకాశం లభించింది. మరో వారం, పది రోజుల్లో కీలకమైన డైరెక్టర్(పా) ఎంపిక కూడా జరుగనున్నట్టు సమాచారం. గతంలో మాదిరిగానే సివిల్ సర్వీసెస్ లేదా గ్రూప్-1 అధికారులను ఎంపిక చేయనున్నట్టు తెలుస్తున్నది. డైరెక్టర్(ఫైనాన్స్) పదవి కూడా ఖాళీగానే ఉండనున్నది. డైరెక్టర్లుగా నియమితులైన సూర్యనారాయణ, వెంకటేశ్వర్లును ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



డైరెక్టర్లను అభినందిస్తున్న జనక్ ప్రసాద్

రామగుండం ఐటీఐని సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ



ఏటీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్

అంతర్గాం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని ఐటీఐని సోమవారం రాష్ట్ర ఉపాధి కల్పన, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రె టరీ సంజయ్ కుమార్ సందర్శించారు. ఆయన ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీసీ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ పనులను పరిశీ లించారు. ఏటీసీ నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణం పూర్తి కాగానే వెంటనే పరికరాలు అమర్చి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశిం చారు. అనంతరం కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఏటీసీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు పూర్తి స్థాయిలో శిక్షణ పొందాల న్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్షలు ఐటీఐ ప్రాంగణంలో మొక్కలు నాటారు. రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఐటీఐ ప్రిన్సిపాల్ సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనులను నెలాఖరులోగా పూర్తిచేయాలి

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) కింద ఎంపికైన పాఠ శాలల్లో అభివృద్ధి పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలె క్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధి కారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంశ్రీ కింద జిల్లాలో 16పాఠశాలలను ఎంపిక చేశారని, వీటిలో మొదటి దశ అభివృద్ధి పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో అకాడ మిక్ పరంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లా నుంచి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలని, ఉదయం, సాయంత్రం 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేసి పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థు లపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యమైన పాఠ్యాం శాలను ఒకటికి రెండుసార్లు వారిచే పునరావృతం చేయించాలని కలెక్టర్ పేర్కొన్నారు. డీఈవో డి.మాధవి, అధికారులు పాల్గొన్నారు.

మేళాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎల్‌ఆర్ఎస్ ప్రొసిడింగ్ అందజేస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రెవెన్యూ, ట్రేడ్ లైసెన్స్, ఎల్‌ఆర్ఎస్ మేళాలను సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మేళాలను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ ఈనెల 15 వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన సయ్యద్ మీర్ ఎల్‌ఆర్ఎస్ మేళలో అనధికార ప్లాటును రూ.24,419 చెల్లించి క్రమబద్ధీకరించుకోగా ప్రొసీడింగ్ కాపీని అందచేసినట్లు పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్ ,టౌన్ ప్లానింగ్ సిబ్బంది శ్రీకర్, సంధ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీపీ, పోలీస్ అధికారులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల కట్టడిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆదేశాల మేరకు కమిషనరేట్‌లో ప్రత్యేక దృష్టి సారించామని సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం కమిషనరేట్‌లో ప్రతీ పోలీసుస్టేషన్‌లో సైబర్ నేరాల దర్యాప్తుపై తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. సీపీ మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైతే ఒక్క ఫోన్ కాల్‌తో సైబర్ వారియర్ అందుబాటులోకి వస్తారన్నారు. పోలీస్ స్టేషన్, టీఎస్‌సీఎస్‌బీ మధ్య సైబర్ వారియర్లు సమన్వయకర్తలుగా పని చేస్తారని సీపీ తెలిపారు. శిక్షణ పొందిన వారు నమోదయ్యే సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉంటారన్నారు. ప్రజలు సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 ఫోన్ నెంబర్‌కు, ఎన్‌సీఆర్‌జీ పోర్టల్, పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. డిజిటల్ అరెస్టులు అని చేసే కాల్స్ వస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీపీ సూచిం చారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపి రాఘవేంద్రరావు, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ సిబ్బంది చిరంజీవి, నరేష్, కోటేష్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు మట్టి, మొరం

- నిర్ణీత ధరలకు అనుమతులు జారీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సొంత అవసరా లకు అవసరమైన మట్టి, మొరం కోసం తహసీల్దార్ల ద్వారా తక్కువ ధరకు అనుమతులు జారీ చేస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి, మొరం సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని అన్నారు. జిల్లాల్లో మట్టి, మొరం తీసుకునేందుకు ట్రాక్టర్ రూ.200, టిప్పర్ రూ.800 రుసుం తహసీల్దార్లకు చెల్లించి అనుమతి పొందాలని కలెక్టర్ తెలిపారు. వాహన వివరాలు, డ్రైవర్ లైసెన్స్ కాపీని జత చేసి దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో అనుమతులు జారీ అవుతాయని పేర్కొన్నారు. మట్టి తరలింపు కోసం వినియోగించే ట్రాక్టర్, టిప్పర్ ఓవర్ లోడ్ కావడానికి వీలు లేదని పేర్కొన్నారు. ప్రతీ నెలా మట్టి తరలింపు వివరాలతో నివేదికను సంబంధిత తహసీల్దార్లు అందించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల



ఓటర్ జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో

మంథని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్‌స్టేషన్ల, ఓటర్ల జాబితా ముసాయిదాను ఎంపీడీవో శశికళ సోమవారం విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డు పై ముసాయిదా పత్రాలను అంటించారు. మండలంలో 35 గ్రామ పంచాయతీల్లో 35,055 మందిని ఓటర్లుగా నమోదు చేశామని, ఇం దులో 17,062 మంది పురుషులు, 17,989 మంది మహిళలు, 4 ఇత రులు ఉన్నారన్నారు. ఓటర్ లిస్టులో ఎవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు. ఈనెల 14న తుది జాబితాలను విడుదల చేస్తా మన్నారు. ఓటర్ల నమోదు ప్రకారం మండలంలో 67 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. వీటి తుది జాబి తాను ఈనెల 15న ప్రకటిస్తామన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాల యంలో మండల ప్రాదేశిక ఎన్నికల ఓటర్ జాబితాను ఎంపీడీవో రామ్మోహనచారి కార్యదర్శులతో విడుదల చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 34,738 ఉండగా పురుషులు 17,189మంది, మహి ళలు 17,548మంది ఉన్నారు. మండలంలో మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంపీడీవో తెలిపారు. జాబితాలో తప్పులు, సవరణలు, ఉంటే సరిచేసుకోవాలని ఎంపీడీవో సూచిం చారు. ఎంపీవో కిరణ్, సూపరింటెండెంట్ శ్రీధర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా కళాశాలలో వర్క్‌షాప్

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్ మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఫిక్సిడీటీ వారి ఆధ్వర్యంలో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ అంశంపై వర్క్ షాప్‌ను నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ నితిన్ మాట్లాడుతూ కళాశాలలో ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకి సంబంధించి అత్యా ధునిక ప్రయోగశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో అత్యాధునిక ప్రయోగ శాలలు, మౌలిక సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధి కారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాత్రాజుపల్లి గ్రామాన్ని టేకుమట్లలో కలపొద్దని మంత్రి ఆదేశం

ముత్తారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాత్రాజుపల్లి గ్రామాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో కలుపవద్దని గ్రామ స్థులు మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందించి శాత్రాజుపల్లిని ముత్తారం మండలంలో కొనసాగించాలని అధికారులను ఆదేశిం చారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలాజీ, సింగిల్ విండో చైర్మన్ యాదగిరిరావు, మాజీ జడ్పీటీసీ జగన్‌మోహన్ రావులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మద్దెల రాజయ్య, గాదం శ్రీనివాస్‌లు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న సీఐ శ్రీనివాస్ తదితరులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్, మోర్రాపూర్, సేవాలాల్‌తండా గ్రామాల్లో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ మిట్టపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎక్సైజ్‌అధికారులు దాడులు చేశారు. 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసునమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారుచేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మిట్లపల్లి శ్రీనివాస్, ఎస్‌ఐ శైలజ, సిరిసిల్ల ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రణీత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికిచెందిన శ్యామల సంతోష్ అనే వ్యక్తిపై అకారణంగా దాడిచేసిన ముగ్గురిపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌కు చెందిన కోళ్లు, కుక్కలు కడారి మల్లయ్య, కడారి పుష్పమ్మ, కడారి రాజమ్మ ఇంటి ముందుకు వచ్చి వాకిలి పాడు చేస్తున్నాయంటూ అతడిపై దాడి చేశారు. అవి తమవి కాదని చెబుతున్న వినకుండా తనపై అకారణంగా దాడిచేశారని బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఇద్దరిపై కేసు..

జమ్మికుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్‌నగర్‌కు చెందిన షేక్‌ఇమ్రాన్‌పాషాపై షేక్ అప్రోచ్, షేక్ ఫిరోజ్ అకారణంగా దాడి చేశారని బాధితవ్యక్తి సోమవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామం బస్టాండు కూడలిలో ప్రభుత్వంనుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలి పారు. ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు బందరి రమేష్, ఐలవేని అనిల్‌పై కేసునమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

వీణవంక, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన బాలిక అదృశ్యమయిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులవివరాల ప్రకారం.. మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన గందం సమ్మక్క తన కూతురు శైలజ ఉదయం నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం రాత్రి తమతోనే తిని పడుకున్న బాలిక తెల్లవారుజాము 3గంటల నుంచి కనిపించడం లేదనిపేర్కొంది. చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని ఫిర్యాదులో పేర్కొంది. తల్లి సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు మేకల దొంగలు అరెస్టు

● పరారీలో మరో ఐదుగురు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వశ్రీరాంపూర్, మల్యాలలో మేకలు దొంగతనం చేసిన కమాన్‌పూర్ మండలం పెంచకల్‌పేటకు చెందిన శివరాత్రి రమేష్, చొప్పదండికి చెందిన మనుపతి సంజీవ్‌కుమార్‌లను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలప్రకారం శివరాత్రి రమేష్, మనుపతి సంజీవ్‌కుమార్‌తోపాటు మరో ఐదుగురు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈనెల2న రెండు కార్లతోపాటు బొలేరోవ్యాన్‌లో వచ్చి కాల్వ శ్రీరాంపూర్‌లో తిప్పనవేన కొమురయ్యకు చెందిన మూడు, మల్యాలలోని బొల్లి రాజయ్యకు చెందిన రెండు మేకలను దొంగతనం చేసి వ్యాన్‌లో ఎక్కించుకొని పరారయ్యారు. చొప్పదండిలోని సంజీవ్‌కుమార్ కొట్టంలో ఐదు మేకలను భద్రపరిచారు. అనంతరం ఈనెల 9న మళ్లీ దొంగతనం చేసేందుకు కాల్వశ్రీరాంపూర్ వస్తుండగా గంగారం క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉన్న శివరాత్రి రమేష్, మనుపతి సంజీవ్‌కుమార్‌లను విచారించగా చొప్పదండిలో మేకలు ఉన్నట్లు తెలి పారన్నారు. మేకలను స్వాధీనంచేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. మరో ఐదుగురు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఏడుగురు రౌడీషీటర్ల బైండోవర్

చందుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని గ్రామాల్లో ఏడుగురు రౌడీషీటర్లను అరెస్టుచేసి తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట సోమ వారం బైండోవర్ చేసినట్లు చందుర్తి ఇంచార్జ్ ఎస్‌హెచ్‌ఓ ఆశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన చింతశేఖర్, బొల్లు శ్రీనివాస్, గంగుల శ్రీనివాస్, అల్లె రాజేందర్, తిమ్మాపూర్‌కు చెందిన గంగిపెల్లి గణేష్, మూడపల్లికి చెందిన బండారి హన్మండ్లుగౌడ్, చందుర్తికి చెందిన బొల్లు మనోజ్ కుమార్‌ను రానున్న స్థానికసంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి వదిలిపెట్టినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ ఆశోక్ కుమార్ తెలిపారు.



వరి పొలంలో మందును పిచికారి చేస్తున్న డ్రోన్



పంట పొలాల్లో డ్రోన్ల వాడకం

● రైతులకు తగ్గిన కూలీల భారం

● సమయం ఆదా అవుతుందంటున్న అన్నదాతలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో అందివస్తున్న సాంకేతికతను అన్నదాతలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కూలీల కొరత, తెగుళ్ల బాధను అధిగమించేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. తక్కువ సమయంలో పంట పొలాల్లో మందుల పిచికారికి డ్రోన్లను వినియోగిస్తున్నారు. కూలీల భారం తగ్గడంతో పాటు చీడపీడల నివారణ సత్ఫలితాన్ని ఇస్తున్నాయి. మందుల పిచికారికి రైతులు డ్రోన్లను వాడుతూ ఆర్థిక భారం తగ్గించుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్ల తిమ్మాపూర్, గుండారం, తదితర గ్రామాల్లోని రైతులు వరి పంటలకు డ్రోన్ల ద్వారా మందులను పిచికారి చేస్తూ తెగుళ్ల ఉధృతిని నివారించుకుంటున్నారు.

సులువుగా మందుల పిచికారి..

మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో వరి నాటు వేసేందుకు స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో పొరుగు రాష్ట్రాల కూలీలతో సాగు పనులను పూర్తి చేశారు. మండలంలో మొత్తం 16800 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేసిన అన్నదాతలకు తెగుళ్ల ఆందోళన కలిగిస్తున్నాయి. దాంతో మందులను పిచికారి చేసేందుకు కూలీల కొరత ఉండడం వల్ల డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఎకరాకు రూ.400 నుంచి రూ.500 అద్దె చెల్లిస్తున్నారు. కేవలం 15 నిమిషాల్లో 20 లీటర్ల మందును డ్రోన్ల సహాయంతో పంట పొలాల్లో సులువుగా పిచికారి చేయిస్తున్నారు. సమయం, ఖర్చు ఆదా అవుతోంది. ఎకరాకు కూలీలతో మందును పిచికారి చేయాలంటే ఇద్దరు కూలీలకు రూ.1600 వెచ్చించాల్సి వస్తోంది. దాంతో పాటు ఇద్దరు కూలీలు ఎకరా పొలానికి గంట సమయం పడుతుంది. ఎకరాకు రూ.1100 నుంచి రూ.1200 కూలీ ఖర్చు తగ్గుతోంది. కూలీ భారం తగ్గడంతో పాటు తెగుళ్ల నివారణ సాధ్యపడుతోంది. గ్రామాల్లోని రైతులు ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల ద్వారా డ్రోన్లను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సాగు యంత్రాలను అద్దెకు ఇచ్చినట్లుగా డ్రోన్లను అందిస్తే మరింత భారం తగ్గనుందని రైతులు పేర్కొంటున్నారు.

ఖర్చు తగ్గింది

చల్ల కిష్టారెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్



నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో పదెకరాలను కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశా. మొదట్లోనే పంటకు తెగుళ్ల సోకకుండా మందును పిచికారి చేసేందుకు సిద్ధమయ్యా. కూలీలు దొరకపోవడంతో వారం రోజులు ఎదురుచూశా. మా పక్క గ్రామమైన తిమ్మాపూర్‌లో డ్రోన్ ద్వారా మందును పిచికారి చేస్తున్నారని తెలిసి తమ పొలంలో చేయాలని కోరాను. ఎకరాకు రూ.500 అద్దెను చెల్లించి డ్రోన్ ద్వారా కేవలం 3 గంటల్లోనే మందును స్ప్రే చేయించా. కూలీలతో చేయిస్తే మొత్తం రూ.17 వేల వరకు ఖర్చవడంతో పాటు రోజంతా సమయం పట్టేది. డ్రోన్ అద్దెకు రూ.6 వేలు వెచ్చించాను. 12 ఎకరాలకు రూ.11 వేలు మిగిలాయి. మందు పిచికారికి ఖర్చు తగ్గింది.

మందు స్ప్రే చేయడం సులువైంది..

గడ్డం రాజిరెడ్డి, రాచర్ల బొప్పాపూర్



నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను వేశా. మందును స్ప్రే చేయడానికి నాతో పాటు మరో కూలీ కలిసి చేసేవాళ్లం. డ్రోన్ ద్వారా పిచికారి చేయిస్తే ఖర్చు తగ్గడంతో పాటు పని సులువుగా ఉంది.

రోజుకు 50 ఎకరాలు పిచికారి చేస్తా..

భీమారి శ్యాం, డ్రోన్ పైలట్, రాచర్ల తిమ్మాపూర్



పంటల సాగులో కూలీల కొరత ఉండడంతో డ్రోన్ ద్వారా మందులను పిచికారి చేస్తే బాగుంటుందని భావించా. డ్రోన్ పైలట్‌గా శిక్షణ తీసుకున్నా. రెండేళ్ల కిందట రూ.7లక్షలు వెచ్చించి డ్రోన్‌ను కొనుగోలు చేశా. గ్రామాల్లో రైతుల వరి పొలాల్లో మందును పిచికారి చేస్తున్నా. రోజుకు 50 ఎకరాలు సులువుగా పిచికారి చేయడం ద్వారా రూ.25వేలు సంపాదిస్తున్నా. ఖర్చులు పోనూ రోజుకు రూ.15వేలు మిగులుతాయి. సీజన్‌లోనే గిరాకీ ఉంటుంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరో డ్రోన్‌ను కొనుగోలు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తా.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన లారీ

● ఆటోలపై పడిన స్తంభాలు..

● తప్పిన పెను ప్రమాదం..



ఆటోలపై పడిన విద్యుత్ స్తంభాలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో రద్దీగా ఉండే గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో సోమవారం ఓ లారీ విద్యుత్ స్తంభాలను ఢీకొనటంతో మూడు స్తంభాలు విరిగిపోయాయి. అక్కడపార్కింగ్ చేసిన ఆటోలమీద పడడంతో దెబ్బతిన్నాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న భవనానికి మెటిరియల్ తీసుకవస్తున్న లారీ విద్యు త్‌స్తంభాలను ఢీకొనటంతో షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ నిలిచిపోయింది. స్తంభాలు రెండు ఆటోలపై పడటంతో ఆటోలు ధ్వంసమయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్‌పునః ప్రారంభానికి విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

పాము కాటుకు గురైన మహిళ.. చికిత్స పొందుతూ మృతి

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన మ్యాకల లచ్చవ్వ(55) అనే మహిళ తన ఇంటి దగ్గర పనిచేస్తుండగా జనవరి 16న పాముకాటుకు గురైంది కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. కొడుకు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పండ్ల దుకాణాల్లో మంటలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట పండ్ల దుకాణంలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా మంటలు రావడంతో శానిటేషన్ సిబ్బంది, పండ్ల దుకాణాల యజమానులు నీళ్ల పోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానిక ఫైర్ సర్వీస్ సిబ్బంది చేరుకొని పూర్తిగా మంటలను ఆర్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్టు సమాచారం.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

చందుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం రామారావుపల్లి, ఎన్గల్, జోగాపూర్ గ్రామాల్లోని బెల్టుషాపులపై సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. రామారావుపల్లి గ్రామానికి చెందిన ముని రాములు వద్ద రూ. 17,650 విలువ గల మద్యం, ఎన్గల్ గ్రామానికి చెందిన కుసుంబ లింగయ్య వద్ద రూ. 7,630 విలువ గల మద్యం, జోగాపూర్‌లో రూ. 3,850 విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓ ఆశోక్ కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపాడు. ఆయన కథనం ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(65) సోమవారం కరీంనగర్ సుల్తానాబాద్ రైల్వేస్టేషన్ల మధ్య సాంబయ్యపల్లి గ్రామ అండర్ బ్రిడ్జి సమీపంలో రైలుపట్టాలపై నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈక్రమంలో కరీంనగర్, తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. రైలు డ్రైవర్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. మృతుడు పసుపు రంగు షర్ట్, గీతల నెక్కర్ ధరించి ఉన్నాడని తెలిపారు.

కొడుకు కోడలు వేధింపులు

మనస్తాపంతో ఉరి వేసుకుని తండ్రి ఆత్మహత్య



గండి వీరేశం(ఫైల్)

సుల్తానాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిపోవాలని కొడుకు దూషించడంతో మనస్తాపం చెందిన తండ్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. నాలుగురోజుల క్రితం జరిగిన ఈఘటన సోమవారం సాయంత్రం వెలుగు చూసింది.

మియాపూర్ గ్రామానికి చెందిన గండి వీరేశం (60)కు భార్య ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. వీరేశం భార్యతోపాటు పెద్దకొడుకు సదయ్య ఇంటిలోని ఒకగదిలో నివసిస్తున్నాడు. కొన్ని రోజులుగా కొడుకుతోపాటు కోడలు వేధింపులకు గురిచేస్తోందని వీరేశం భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. నీకు ఇంకా ఇద్దరు కొడుకులు ఉన్నారు, ఎప్పుడు నావద్దనే ఉంటున్నావు, నువ్వు ఇంటినుంచి వెళ్ళిపోఅంటూ దూషిస్తున్నారని పేర్కొంది.

వీరేశం భార్య ఈనెల6న వేరే ఊరికి వెళ్ళగా మళ్ళీ దూషించడంతో మనస్తాపం చెందిన వీరేశం ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. ఈనెల 8న భార్య తిరిగి వచ్చే సరికి భర్త అగుపించలేదు. కొడుకును అడుగగా పొంతన లేని సమాధానం చెబుతుండడంతో అదే ఊళ్లో ఉన్న మిగితా కుమారులకు తెలిపింది. వారితో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. సోమవారం గ్రామంలోని ఎల్లమ్మ గుడి ప్రాంతంలోని తాటి చెట్ల వద్ద దుర్వాసన రావడంతో కొందరు అక్కడికి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉన్న వీరేశం మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలుపలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 23మంది రైతులు 216క్వింటాళ్ల విడిపత్తి, ఏడుగురు రైతులు 11క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠధర రూ.7వేలు, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్ల చేపట్టారు.

కొండగట్టు అంజన్నకు ఆభరణాల వితరణ

● హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రూ.85లక్షల విలువైన బంగారు, వెండి అభరణాల అందజేత



అంజన్న ఆలయంలో ఆభరణాలను అప్పగిస్తున్న భక్తుడు మహేశ్‌రెడ్డి-రాధికరెడ్డి దంపతులు

మల్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఏఎంఆర్ ప్రైవేట్ లిమిటెడ్ అనేకంపెనీ యజమాని, కొండగట్టు ఆంజనేయస్వామి భక్తుడు ఏ.మహేశ్‌రెడ్డి-రాధికరెడ్డి దంపతులు రూ.85లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను అందజేశారు. రెండేళ్లక్రితం ఆలయంలో చోరీ జరిగిన సందర్భంలో స్వామివారి మకరతోరణం, శఠగోపం, గర్భాలయ వెండి తొడుగులు అపహరణకు గురిఅయ్యాయి. దీంతో అప్పటినుంచి గర్భాలయం తొడుగులు లేక బోసిపోతుండగా మహేశ్‌రెడ్డి వాటి ఏర్పాటుకు ముందుకు వచ్చారు. స్వామివారికి 325గ్రాముల బంగారం తాపడంతో రాగి రేకుపై కిరీటం, రామరక్షతోపాటు 48.5కిలోల వెండితో గర్భాలయ ద్వారానికి కుడి, ఎడమ వైపు ద్వార బంధనం, తొడుగులు తయారు చేయించి ఆలయ అధికారులు, అర్చకులకు అప్పగించారు. భక్తుడు అప్పగించిన బంగారు, వెండి వస్తువులను దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయగం, జ్యూవెల్లరీ వెరిఫికేషన్ అధికారి అంజనీదేవి పరిశీలించి తూకం వేయించారు. ఈ కార్యక్రమంలో ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్, ఆలయ స్థానిచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్, రఘు, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహిళను హత్యచేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ జిల్లాప్రధాన న్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 జనవరి7న లత అనే మహిళను బోయిని రమేష్ హత్య చేశాడు. పెద్దపల్లి జిల్లాధర్మారం మండలం పత్తిపాక గ్రామానికి చెందిన కనుక మనవ్వ చిన్న కుమార్తె లతకు వెల్గటూర్ మండలంలోని పాత గూడూరుకు చెందిన దేవయ్యతో వివాహం జరిగింది. దేవయ్య జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లగా భార్య లతకు అదే గ్రామానికి చెందిన బోయిని రమేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. 2021 జనవరి 7న లత ఇంటికి రమేష్ రాగా వారిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతోలతను రమేష్ గొంతునులిమి హత్యచేశాడు. మృతురాలి తల్లి వెల్గటూర్ పోలీసు లకు ఫిర్యాదు చేసింది. కోర్టుడ్యూటి పోలీసులు సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితునికి శిక్షపడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులు ప్రేమ్ కుమార్, కిషోర్, రామచందర్‌రావు, కోటేశ్వర్, కోర్టు డ్యూటీ అధికారులు శ్రీధర్, శ్రీకాంత్, కిరణ్ కుమార్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

పేలిన ఆర్టీసీ బస్సు టైరు

● డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు వెనుక టైర్ సోమవారం పేలిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కరీంనగర్ ఒకటో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా సిరిసిల్లకు 72 మంది ప్రయాణికులతో వెళ్తోంది. గ్రామ శివారులోకి చేరుకోగానే ఒక్కసారిగా భారీ శబ్దంతో వెనుక టైర్ పేలిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును రహదారికి ఓ వైపుకు మళ్లించాడు. దీంతో ప్రయాణికులు ఊరిపి పీల్చుకున్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తనభర్త తరుపు బంధు వులు అకారణంగా దాడిచేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐదుగురిపై సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తప ల్లికి చెందిన మోకిడి రజిత మొదటి భర్త నాగేశ్వర్‌రావు కరోనాతో మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన మోకిడి దామోదర్ రజితని గతేడాది డిసెంబర్27న కొత్తగట్టు దేవాల యంలో రెండో వివాహం చేసుకున్నాడు. అయితే ఈ నెల3న దామోదర్ మొదటిభార్య జ్యోతి, ఆమెచెల్లి స్వాతి, తల్లి సరోజన, తమ్ముడు శ్రీకాంత్, రాజు, మరి కొంతమంది తనపై కారంచల్లి దాడిచేసి, పుస్తెల తాడు ఎత్తుకెళ్లారని పేర్కొంది. బాధితమహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

మహా శివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలి

● ఈ నెల 25 నుంచి 27 వరకు జాతర ● ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వేములవాడలో మహాశివరాత్రి వేడుకలు విజయవంతం చేయాలని జిల్లాకలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా అన్నారు. సోమవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్‌మహజన్‌తో కలిసి జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా అదనపుబస్సులు, పారిశుధ్యం, పార్కింగ్, దేవాలయం వద్ద వసతిసౌకర్యం, తాగునీటి సరఫరా, ఆరోగ్య శిబిరాలు, ఫైర్ ఇంజన్ల సౌకర్యం, కల్యాణకట్ట, ధర్మగుండం, బద్దిపోచమ్మ ఆలయం, హెల్త్ సెంటర్, సీసీటీవీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల25నుంచి 27వరకు వేములవాడలో జరిగే మహాశివరాత్రి జాతర వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలన్నారు. జాతర సమయానికి వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. భద్రత వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని ఫోన్‌సిగ్నల్స్ సమస్యలు రాకుండా ఆపరేటర్లతో చర్చించి తాత్కాలిక టవర్‌లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. వివిధ డిపోల నుంచి 857 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. 20లక్షల లీటర్ల నీటిని మిషన్‌భగీరథ ద్వారా సరఫరా చేయనున్నట్లు వివరించారు. 500మంది పారిశుధ్య సిబ్బంది ఉంటారని మున్సిపల్‌కమిషనర్ తెలిపారు. 8అగ్నిమాపక వాహనాలు, 260సీసీ కెమెరాలు ప్రస్తుతం ఉండగా మరో 180 కెమెరాలు అందుబాటులోకి తీసుకరానున్నట్లు తెలిపారు. 3 లక్షల లడ్డుప్రసాదం, సిద్ధంగా ఉంచుతామని, భక్తులకు అల్పాహారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఈవో వివరించారు. ప్రధాన రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతర విధులు నిర్వహించడానికి సిబ్బందికి, ముఖ్య అతిథులకు వసతి సదుపాయం కల్పించాలని, భక్తులకు చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు. వేములవాడ పరిసరాల్లో మద్యం అమ్మకాలను నిషేదించాలని అన్నారు. ఎస్పీ అఖిల్‌మహజన్ మాట్లాడుతూ గతం కంటే ఎక్కువగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని, పోలీసుల కోసం టెంట్లు, తాగునీటి సరఫరా ఉండాలన్నారు. తిప్పాపూర్ వద్ద సాయంత్రం ఉండే మార్కెట్ జాతర సమయంలో ఉండకుండా వ్యాపారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, దేవస్థానం ఈవో వినోద్‌రెడ్డి, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న దేవస్థానం ఈవో వినోద్‌రెడ్డి

బీసీ ఉద్యమ నేతలను అవమానించిన సీఎం

ఎమ్మెల్సీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ ప్రతినిధుల సమావేశానికి గైర్హాజరై సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమ నేతలను అవమానించారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. జగిత్యాలలో సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ పాలన ఐఫోన్‌లా ఉంటే, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌ను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. యాదాద్రి ఆలయం తరహాలో కొండగట్టు ఆలయానికి గత ప్రభుత్వం రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వాలు మారిన గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వంపై ఉందన్నారు. కేసీఆర్ అధికారంలోకి గానే బోర్నపెల్లి బ్రిడ్జి నిర్మాణం కల సాకారం అయ్యిందన్నారు. పాలు తాగి తల్లి రొమ్ము గుద్దిన చందాన జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ మారినా గులాబీ సైనికులు బీఆర్‌ఎస్‌ను అంటిపెట్టుకునే ఉండడం అభినందనీయం అన్నారు.

సారంగాపూర్ మండలం మంగేళ వద్ద ఓ రైతు తన పొలం ఎండిపోయిందని సోషల్ మీడియాలో పెట్టిన విషయం తనను కలిచివేసిందన్నారు. కేసీఆర్ పాలనలో వరదకాలువ ఓ జీవధారగా ఉండేదన్నారు. కాళేశ్వరం లింక్-1 ఉపయోగిస్తే తిరిగి పూర్వవైభవం వస్తుందన్న సోయి కూడా ప్రభుత్వానికి లేదన్నారు. రైతులను ఇబ్బంది పెడుతూ కేసీఆర్‌ను బద్నామ్ చేయాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. రాజకీయాలు పక్కనపెట్టి లింక్-1 ద్వారా నీళ్లను విడుదల చేయాలన్నారు. బీసీల జనాభా 52శాతం ఉంటే ప్రభుత్వం లెక్కలు తప్పుగా చూపించిందన్నారు. ఇవే లెక్కలు పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ మాట్లాడి పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశంలో 42శాతం రిజర్వేషన్‌ల కల్పనకు బిల్లు ఎందుకు ప్రవేశపెట్టలేదో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. 31సార్లు ఢిల్లీ వెళ్లే తీరికున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీ ప్రతినిధుల సమావేశానికి హాజరుకాకుండా ఏం చేసారని ఆమె ప్రశ్నించారు.

ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, సీనియర్ నాయకులు, ప్యాక్స్ చైర్మన్ రమణరావు, పట్టణ అధ్యక్షుడు గట్టు సతీష్, మాజీ కౌన్సిలర్ దేవేందర్ నాయక్, తుల రాజేందర్, సీనియర్ నాయకులు వొల్లెం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, రాము, ఆసిఫ్, మల్లారెడ్డి, ఆనందరావు, ప్రవీణ్, గంగాధర్, రాజు పాల్గొన్నారు. అంతకుముందు బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రూపొందించిన క్యాలెండర్, డైరీలను కవిత చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. తదనంతరం జగిత్యాల నియోజకవర్గంలో ఆయా మండలాలు, పట్టణాల నాయకులతో మండలాల వారీగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని కవిత భరోసా ఇచ్చారు.

రాజన్న ఆలయం.. భక్తజన సంద్రం







కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం, తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం సోమవారం భక్తజనంతో సందడిగా మారింది. మినీ మేడారం జాతర, మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు, మహాశివరాత్రి సమీపిస్తుండటంతో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 80 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. ఆదివారం రాత్రి పెద్ద సంఖ్యలో వేములవాడకు చేరుకున్న భక్తులు తెల్లవారుజామునే ఆలయ ధర్మగుండంలో శివసత్తుల పూనకాలతో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మ దర్శనం, కోడెమొక్కుల క్యూలైన్‌లో భక్తులు సుమారు 5 గంటల వరకు నిరీక్షించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. శీఘ్ర దర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి ప్రవేశించి ముందుగా లక్ష్మీగణపతిని, తరువాత శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకోగా శ్రీపార్వతీదేవి అమ్మవారికి నూతన వస్త్రాలను అందజేసి ఒడిబియ్యం పోస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు అనుబంధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారి వెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్, సూపరింటెండెంట్‌లు వరి నర్సయ్య ఉద్యోగులు రాజేందర్, నరేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కొడిమ్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ శివారులోని ఎత్తైన గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలతో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో వెంకన్నవిజయ దంపతులు, ఆలయ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి, అర్చకులు శ్రీని వాసాచార్యులు రజినీకాంతాచార్యులు, మనోజ్‌కుమారాచార్యులు, యాగ్నికులు శ్రీనాథ్, వరప్రసాద్ ఎదుర్కొని కల్యాణ కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో నర సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేదికపై పెద్దపల్లి జిల్లా ఈవో ఎం.శంకర్ ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ స్వర్ణలత, మాజీ జడ్పీటీసీ ప్రశాంతి, పూడూర్ సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు. మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న అధికారులు, భక్తులు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది
- ఉపాధ్యాయుల స్థానానికి 17 మంది నామినేషన్లు
- ర్యాలీలతో హోరెత్తిన కరీంనగర్
- నేడు నామినేషన్ల పరిశీలన...
- 13న ఉపసంహరణ

చివరి రోజు నామినేషన్ల జోరు



కరీంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్లను స్వీకరించారు. పట్టభద్రుల స్థానానికి వంద మంది అభ్యర్థులు 192 సెట్ల నామినేషన్లు వేయగా ఉపాధ్యాయ స్థానంలో 17 మంది అభ్యర్థులు 38 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈ నెల 13వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. పోలింగ్ ఈ నెల 27న జరుగనున్నది.



నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

చివరి రోజు పట్టభద్రుల స్థానానికి 51 మంది నామినేషన్

సోమవారం ఎక్కువ మంది నామినేషన్లు వేస్తారని అంచనా వేసిన జిల్లా యంత్రాంగం భారీ గా బందోబస్తు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డితోపాటు పలువురు అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీగా వచ్చి నామినేషన్లను దాఖలు చేశారు. సోమవారమే పట్టభద్రుల స్థానానికి 51 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ చైర్మన్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడిజిల్లాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పట్టభద్రులు పాల్గొన్నారు.

- ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల నుంచి వచ్చిన పట్టభద్రులు, ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి పద్మ నాయక కల్యాణమండపం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు.
- కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ మాజీ కార్పొరేటర్లు ఎడ్ల అశోక్, సాధవేని శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు, పట్టభద్రులతో కలిసి టవర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా వచ్చి నామినేషన్‌ను దాఖలు చేశారు.
- పట్టభద్రుల స్థానానికి పోటీచేస్తున్న పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు వివిధ సంఘాలు, పట్టభద్రులు, అభిమానులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్లను సమర్పించారు.
- ఉద్యమకారుడు, కేసీఆర్ అభిమాని పిడిశెట్టి రాజు సైకిల్‌పై కలెక్టరేట్ చేరుకొని సాదాసీదాగా పట్టభద్రుల స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు.
- టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డితోపాటు మరికొంత మంది అభ్యర్థులు ర్యాలీగా వచ్చి నామినేషన్లను అందజేశారు.

మంత్రుల వాహనాలను అడ్డుకున్న సర్దార్ రవీందర్‌సింగ్

ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కలెక్టరేట్ నుంచి బయటకు వస్తున్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రుల వాహనాలను కలెక్టరేట్‌లోకి అనుమతించడాన్ని తప్పుబడుతూ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు చేరుకొని మంత్రులను వాహనాల నుంచి దింపివేయడంతో వారు నడుచుకుంటూ లోనికి వెళ్లడంతో వివాదం సద్దుమణిగింది.

ఈనెల 3న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా నామినేషన్ వేసిన వారిలో పట్టభద్రుల స్థానం బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్‌టికెట్ ఆశించి చివరి వరకు ప్రయత్నంచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా చేసిన గంగాధర్, ఆదిలాబాద్ జిల్లా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థి వై.అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. 27న ఎన్నికలు, మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.

బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ

ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రవీందర్‌సింగ్

కరీంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): పట్టభద్రుల నామినేషన్‌ల ఘట్టం చివరి రోజున అనూహ్య పరిణామాలుచోటు చేసుకున్నాయి. ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న హరికృష్ణ మొదటి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించారు. కాంగ్రెస్ టికెట్ రాక పోవడంతో చివరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండేందుకు ఆసక్తి చూపించారు. చివరి నిమిషంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ప్రసన్న హరికృష్ణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో అనూహ్యంగా ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

- కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మొదటి నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉండేందుకు సముఖత వ్యక్తం చేసి ప్రచార పర్వాన్ని కొనసాగించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపక పోవడంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండాలని నిర్ణయించుకున్నారు. నామినేషన్ల పర్వం చివరి రోజు సోమవారం ఒక్కసారిగా ఆయన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఎఐఎఫ్‌బి) నుంచి నామినేషన్ వేయడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి రాకపోవడంతో ప్రసన్న హరికృష్ణ మరో జాతీయ పార్టీ అయిన బీఎస్పీ నుంచి పోటీలో ఉంటూ నామినేషన్ వేయడం, రవీందర్‌సింగ్ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేసేందుకు నామినేషన్ వేయడంతో రాజకీయచిత్రం ఒక్కసారిగా మారిపోయింది.











నామినేషన్ దాఖలు చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న హరికృష్ణ, కూర రఘోత్తంరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

ఏడాదిలో 56 వేల ఉద్యోగాలిచ్చాం..

- త్వరలో మరో రెండు లక్షల ఉద్యోగాలిస్తాం..
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్
- నాలుగు ఉమ్మడి జిల్లాల ముఖ్య కార్యకర్తలతో సమావేశం



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పక్కన మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు, నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టిన ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) చైర్మన్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని శాఖల్లోని ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. తెలంగాణ ఏర్పడిందే ఉద్యోగాల కోసమన్నారు. బండి సంజయ్ రాష్ట్రానికి, తన నియోజకవర్గమైన కరీంనగర్‌కు ఒక్కరూపా యి తీసుకురాలేదని, బీజేపీకి ఎంపీలుండి లాభంలేదని, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ విషయంపై పట్ట భద్రులు బీజేపీ ఎంపీలు, నాయ కులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కదని ముందే గుర్తించిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి నరేంద్రమోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌పార్టీ అభ్యర్థులను పోటీలో నిలపకుండా బీజేపీకి సహకరిస్తోందని విమర్శించారు. క్రమశిక్షణ, కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి నరేందర్‌రెడ్డి అని ఏఐసీసీ గుర్తించి టికెట్ ఇచ్చిందన్నారు. అందరూ నరేందర్‌రెడ్డి గెలుపునకు సహకరించాలని కోరారు.

- రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు ఇస్తోందని, 10 ఏళ్లుగా లేని డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 10 వేల టీచర్లను భర్తీ చేసామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతిష్టాత్మకమైన ఈ ఎమ్మెల్సీ ఎన్నికలో నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు.
- మంత్రి సీతక్క మాట్లాడుతూ జీవన్‌రెడ్డి స్థానాన్ని నరేందర్‌రెడ్డితో గెలిపించి భర్తీ చేయాలని కోరారు.10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్‌లు ఇచ్చామన్నారు.
- మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ జీవన్‌రెడ్డి మళ్లీ పోటీ చేసేందుకు ఒప్పుకోలేదని, ఇదే స్థానంలో నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని తమ అధిష్ఠానం నిర్ణయించిందన్నారు.
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువతకు అండగా నిలవాలున్నారు. టీచర్ల బదిలీలు చేపట్టి అండగా ఉన్న ప్రభుత్వానికి మీరు అండగా ఉండాలన్నారు.
- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ బీజేపీ మతతత్వ ఎజెండాతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వర్గీకరణను పూర్తి చేశామన్నారు. నరేందర్‌రెడ్డికి మద్దతు ఇచ్చి గెలిపించాలన్నారు.
- మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 60 ఏళ్లలో జరగని కులగణను పూర్తి చేశామన్నారు. అప్పుల కుప్పగా మారినా రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామన్నారు.
- మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి విద్యా సంస్థలు స్థాపించి ఎందరికో ఉద్యోగాలు కల్పించారన్నారు. నరేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు.
- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... గత ఐదు నెలల్లో మూడు సార్లు ప్రచారం చేసి అందరి మన్ననలు పొందనని, అందుకే ఏఐసీసీ తనను అభ్యర్థిగా నియమించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు పోతుందని తెలిపారు. జీవన్‌రెడ్డి అడుగు జాడల్లో ముందుకు సాగుతానన్నారు.

భారీ ర్యాలీ

కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌టాప్ వాహనంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్‌తోపాటు మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, నాలుగు ఉమ్మడి జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా తెలంగాణ చౌక్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ జెండాలు చేతబూని, నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలంటూ నినాదాలు చేశారు. అభ్యర్థి, ముఖ్య అతిథులను కార్యకర్తలు గజమాలతో సన్మానించారు. తెలంగాణ చౌక్‌లో మంత్రులు మాట్లాడిన అనంతరం వాహనంలో నేరుగా కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు టి జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్‌లు, వేమలవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, షబ్బీర్ అలీ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ విఫలం

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి



వాకర్స్‌తో పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్ట భద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరి ష్కరించడంలో గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్‌ను, జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేక పోయాయన్నారు. మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని, తనను ఆశీర్వదించి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ లీగల్ సెల్ అధ్యక్షుడు శ్రవణ్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్య నారాయణరావు, మాజీమేయర్ సునీల్‌రావు, బేతి మహేందర్, పెద్దపల్లి జితేందర్, సుగుర్తి జగదీశ్వర్, సోమిడి వేణుప్రసాద్, నాగసముద్రం ప్రవీణ్, శ్రీనివాస్, గాయత్రిదేవి, గాజుల స్వప్న, బోయినపల్లి ప్రవీణ్‌రావు, సాయిని మల్లేశం, వంగల పవన్, చొప్పరి జయశ్రీ, మామిడి చైతన్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయల సమస్యలు పరిష్కరిస్తా

బీజేపీ ఎమ్మెల్సీ టీచర్స్ అభ్యర్థి మల్క కొమురయ్య

భగత్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే గొంతుకనవుతానని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. సోమవారం నగరంలో నామినేషన్ వేసిన అనంతరం ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక ప్రభుత్వాలుగా మారాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు కేవలం జీతాలు పొందుతున్నారే తప్ప ఇతర సౌకర్యాలు పొందడం లేదన్నారు. ఉపాధ్యాయులకు పెన్షన్, గ్రాట్యుటీ, జీపీఎఫ్ సరెండర్ లీవ్ డబ్బులు, పీఆర్సీ ఇచ్చే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన ఏనాడూ మాట్లాడింది లేదన్నారు. తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యుడు ఎన్‌వీఎస్ ప్రభాకర్, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, నాయకులు పోలి సత్యనారాయణ, నరేందర్‌రావు, కృష్ణవేణి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

న్యూస్ బాక్స్

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

రామగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లతోపాటు కెరీర్ గైడెన్స్ సంబంధించిన చాట్స్‌లను పంపిణీ చేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోల్కామూరి శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ గంటవెంకటరమణరెడ్డి, డాక్టర్ శరణ్య, సభ్యులు మేకల మారుతీ, తీగల శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌రావు, ఉపాధ్యాయులు సత్యమూర్తి, సత్యనారయణ, దేవేందర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ అర్చకుడి పై దాడి దురదృష్టకరం

రామగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడి దురదృష్టకరమని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కోశాధికారి సముద్రాల విజయసారథి ఖండించారు. నిత్యం దైవసేవలో నిమగ్నమైన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రంగరాజన్‌ను బెదిరింపులకు గురి చేస్తూ దాడి చేయడం అమానుషమన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీ భవనానికి నిధులు విడుదల చేయాలి

మంథని, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంథనిలో బీసీ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటకార్ కిషన్‌జీ సోమవారం వినతి పత్రం అందజేశారు. బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మున్సిపల్ పరిధిలో 5 గుంటల స్థలం కేటాయింపునకు పాలకవర్గం తీర్మానించిందన్నారు. భవన నిర్మాణానికి గతంలో కేటాయించిన నిధులను మంజూరు చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు ఐలి ప్రసాద్, నాయకుడు కుడుదుల వెంకన్నలు ఉన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

జూలపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ కూలీల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి కార్యదర్శులకు అందజేశారు. వైద్యఆరోగ్య కేంద్రంలో సోమవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేసి పని ప్రదేశంలో ఇవ్వాలన్నారు. ఉపాధిహామీ మండల ఏపీవో సదానందం, వైద్యాధికారి సంపత్ రెడ్డి, సీహెచ్ఓ కలీమ్ పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

ధర్మారం పిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) జీవన ఎరువుల ప్రాముఖ్యత తెలిపేందుకు మంగళవారం బొట్లవనపర్తి రైతు వేదికలో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా అవగాహన కార్యక్రమం ఉంటుందని వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, రైతులు పాల్గొనాలని సూచించారు.

బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా రవి


నియామక పత్రం అందుకుంటున్న కలవేన రవి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన కలవేన రవిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ పేర్కొన్నారు. సోమవారం కలవేన రవికి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా కలవేన రవి మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ముత్తారం, ఫిబ్రవరి 10: (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. మండలంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా, దర్యాపూర్ శివారులోని ఆదర్శ లో పది, ఇంటర్ విద్యార్థులకు అదనపు తరగతులను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను రాణించేలా సన్నాహాలు చేస్తున్నారు.

అదనపు తరగతుల కోసం ప్రత్యేక చర్యలు

కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించడంతో స్కిల్ డెవలప్‌మెంట్ సిలబస్‌పై పట్టు ఉంటుంది. దీంతో ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే విద్యార్థులలో ఆత్మస్థర్యం పెరుగుతుందన్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా విద్యార్థులు ముందంజలో ఉంటారు.

ఉత్తీర్ణత శాతం ఇలా...

2012-13	100శాతం,	8.5 జి.పి.ఏ,
2013-14	87శాతం,	8.3జి.పి.ఏ,
2014-15	50శాతం	8.3జి.పి.ఏ,
2015-16	100శాతం	9.2జి.పి.ఏ,
2016-17	100శాతం	9.2జి.పి.ఏ,
2017-18	100శాతం	9.5జి.పి.ఏ,
2018-19	94శాతం	9.5జి.పి.ఏ,
2019-20	100శాతం	10జి.పి.ఏ,
2020-21	100శాతం	10జి.పి.ఏ,
2021-22	100శాతం	8.7జి.పి.ఏ,
2022-23	100శాతం	8.2జి.పి.ఏ,
2023-24	100శాతం	9.8జి.పి.ఏ

వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తాం

ప్రత్యేక అధికారి స్వప్న



పాఠశాలలో ప్రత్యేక అధికారిగా ఈ యేడు బాధ్యతలు తీసుకున్నా. గతంలో కూడా విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో మానసిక ఉత్సాహం కలిగించేందుకు కల్చరల్ అక్టివిటిలు నిర్వహిస్తున్నాం.

ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు

ధర్మారం పిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కేక్, స్వీట్స్ పంపిణీ చేశారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలు గోదావరిఖనిలో నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీ వంశీకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అమ్మపరివార్ అనాథ ఆశ్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఓదెల, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీ వంశీకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అలాగే ఆలయంలో ఎంపీ కుటుంబ సభ్యుల పేర్ల మీద అర్చనలు నిర్వహించి ఆలయ సమీపంలో స్వీట్లు పంపిణీ చేశారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ జన్మదిన వేడుకలను మజీద్‌చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఎంపీ వంశీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేణి సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి, స్వీట్లు పంపిణీచేశారు.

సామాన్యశాస్త్ర పరీక్షలో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

కమాన్‌పూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి సామాన్యశాస్త్ర ప్రతిభా పరీక్షలో జూలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి శ్రీవరుణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. డీఈవో డి.మాధవి చేతులమీదుగా బహుమతి అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీవరుణ్, గైడ్ టీచర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఎలిగేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కవ్వంపల్లి అనిల్(37)ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సోమవారం అనిల్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి భార్య ప్రేమలత, కుమారుడు వర్షిత్ ఉన్నారు. మోహన్‌రావు, పోచయ్య, వినోద్, ఉన్నారు.

వైభవంగా సంతోషిమాత విగ్రహ ప్రతిష్ఠ


ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

జ్యోతినగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నంలోని లుకలయ్య గుడి ప్రాంగణంలో నిర్మించిన చంద్రమౌళేశ్వర స్వామి, సంతోషిమాతల ఆలయంలో సోమవారం దేవతా మూర్తుల ప్రాణ ప్రతిష్ఠాపన వైభవోపేతంగా నిర్వ హించారు. వేద పండితులు విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్ ంంగ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. 3 రోజులుగా వేద పండితుల మత్రోత్సరణల నడుమ స్వామివారికి హోమం, నవగ్రహ పూజలు, 80 కలశాలతో పూజలు చేసినట్లు అర్చ కులు ధర్మపురి తెలిపారు. లోకేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెప్యాల రామారావు, కేశవరావు, మాధవరావు, రావికంటి ఈశ్వర్, శ్రీపతిరావు, నడిపల్లి లక్ష్మి మనోహర్‌రావు, శివ సంతోష్, బద్రి విశాల్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగానికి వ్యతిరేకంగా వర్గీకరణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పసుల రాంమూర్తి

గోదావరిఖని, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తి విరుద్ధంగా జరిగిందని, వర్గీకరణను రేవంత్‌రెడ్డి వెనుకకు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి హెచ్చరించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కలు, ఇప్పుడు తెలంగాణ జనాభా లెక్కలు ఎలా కుదురుతాయని ప్రశ్నించారు. మాలలకు రేవంత్‌రెడ్డి ద్రోహం చేశాడని, మాలలతోనే కాంగ్రెస్ పార్టీ పతనమవుతుందని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగ బీజేపీ కార్యకర్తగా వ్యవహరించి బీజేపీకి ఓటు వేయాలని తిరిగారని, ఇప్పటికైనా వర్గీకరణ ప్రక్రియ వెనకకు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీలను తెలంగాణలో తిరగనివ్వమని హెచ్చరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఎస్సీ వర్గీకరణపై నిర్ణయం తీసుకోలేదని, రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణపై తీర్మానం చేయడం సరైంది కాదన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 14న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని, ఈ బంద్‌లో సబ్బండవర్గాల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేవి లక్ష్మీనర్సయ్య, సుధీర్, శ్రీశైలం, మధుబాబు, ఎరుకల రాజకిశోర్, నవీన్, రమణమూర్తి, సుధీర్ పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నదని బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి సతీమణి గోదావరి సూచించారు. నందనగార్డెన్లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా అంజిరెడ్డి వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టాభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. సమావేశం అనంతరం జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిని సన్మానించారు. సురభి నవీన్ రావు, ఆరుముళ్ళ పోశం, కోమల్ల అంజనేయులు, గుర్రాల మాలేశం, సదానందం, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో రెల్లి కులస్థులకు అన్యాయం...


సమావేశంలో మాట్లాడుతున్న రెల్లి సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్ర జ్యోతి): ఎస్సీ వర్గీకరణతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న రెల్లి కులస్థులను గతంలో ఎస్సీ-ఏలో ఉండగా ఇప్పుడు ఎస్సీ-సీలోకి మార్చడంతో అన్యాయం జరుగుతుందని జాతీయ రెల్లి గ్రూపు కులాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు భూపతి అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అంగడి బజార్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో 13 సంఘాలు పారిశుద్య వృత్తిగా జీవిస్తున్న వారిని ఎస్సీ-ఏ గ్రూప్‌గా విభజించి ఒక శాతం కేటాయించారని, ఇప్పుడు జరిగిన వర్గీకరణలో మూడు గ్రూపులుగా విభజించడంతో రెల్లికులస్థులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతుందన్నారు. గ్రూప్-సీలో మార్చడం వల్ల తాము ఉద్యోగ, విద్య అవకాశాలు కోల్పోతున్నామని వారన్నారు. నాయకులు అప్పారావు, భూలోకం, ఆది నారాయణ, ధనాల చంద్రశేఖర్, అప్పారావు, సూర్యనారాయణ, గురుమూర్తి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

ధర్మారం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర కీలకమని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ధర్మారంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, దొంగతనాలను నివారించేందుకు సీసీ కెమెరాలు ఎంతో అవసరమవుతాయని అన్నారు. త్వరగతిన నిందితులను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన వ్యాపార, వాణిజ్య, కుల సంఘాలతో పాటు తోడ్పాటును అందిస్తున్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఎస్ఐ లక్ష్మన్, కానిస్టేబుల్ రజనీకాంత్‌లను సీఐ అభినందించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెల ఏర్పాటు అంశం పరిశీలిస్తామని, ఆయా గ్రామాల ప్రజలు ముందుకు రావాలని సూచించారు.



ఓసీపీ-3ని తనిఖీ చేసిన రక్షణ కమిటీ బృందం

యైటింక్లైయిన్ కాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-2 పరిధిలోని ఓసీపీ-3ని రక్షణ కమిటీ బృందం సోమవారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఉపరితల గనుల్లో ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. ప్రత్యేక రక్షణ బృందంలో కే చంద్రశేఖర్, పీవో జీడీకే సీఎం(2, 2ఎ, 5) పీ శ్రీనివాస్, ఎస్ఓ, పీ శైలేంద్ర కుమార్, పీఈ కే సమ్మయ్య ఉన్నారు. వారి వెంట ఓసీపీ-3 పీవోఎస్ మధుసూదన్, ఏరియా రక్షణాధికారి సంతోష్ కుమార్, ఓసీపీ-3 మేనేజర్ భరత్ కుమార్, సర్వే అధికారి ఎస్ నర్సింగరావు, రక్షణాధికారి శంబునాథ్ పాండే పాల్గొన్నారు.


ఓసీపీ-3లో పరిశీలిస్తున్న రక్షణ కమిటీ బృందం

జీఎంలకు కలిసి వస్తున్న ఆడ్రియాల ప్రాజెక్టు

ఐదుగురు జీఎంలు డైరెక్టర్లుగా నియామకం


చంద్రశేఖర్‌రావు వీరారెడ్డి ఎన్.వీ.కే శ్రీనివాస్ వెంకటేశ్వర్లు

రామగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి లాంగ్‌వాల్‌ప్రాజెక్టు ఏరియా (ఏపిఏ) డివిజన్‌లో జీఎంలుగా పనిచేసిన వారు డైరెక్టర్లుగా ఎంపికవుతున్నారు. ఏపిఏ డివిజన్‌లో జీఎంలుగా పనిచేసిన ఇప్పటికి ఐదుగురు సింగరేణి డైరెక్టర్‌లుగా పదవులు వరించాయి. లాంగ్‌వాల్ ప్రాజెక్టులో పనిచేసిన వెంకటేశ్వర్లుకు సోమవారం డైరెక్టర్ (ఆపరేషన్స్)గా అవకాశం లభించింది. ఈమేరకు త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రాజెక్టు ఏర్పడిన సమయంలో తొలి జీఎంగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రావు 2010-15 వరకు పనిచేసి డైరెక్టర్ పదోన్నతి పొందారు. అనంతరం ఆయన స్థానంలో 2015-2017 రెండు సంవత్సరాలు పనిచేసిన చంద్రశేఖర్ డైరెక్టర్ అవకాశం లభించింది. ఆయన స్థానంలో జీఎంగా బాధ్యతలు స్వీకరించిన వీరారెడ్డి 2017-19 రెండు సంవత్సరాలు కోల్‌ఇండియాలోని ఈసీఐఎల్‌లో ఉన్నత అవకాశం పొందారు. 2019లో ఏపిఏ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వీ.కే శ్రీనివాస్ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు సింగరేణి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సింగరేణి సంస్థలో డైరెక్టర్‌ల పోస్టుల ఖాళీలు, భర్తీలు సర్వసాధారణమే అయినా ఆ అవకాశం ఏపిఏ జీఎంలకే రావడం కొసమెరుపు.

కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పించాలి

రామగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో సిగ్రూప్ టెండర్‌లో కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి అవకాశం కల్పించాలని సోమవారం ప్రాజెక్టు అధికారి వెంకటరమణకు ఐఎఫ్టీయూ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న వినతి పత్రం అందజేశారు. టెండర్‌లో పెనాల్టీ ఉండడం కారణంగా కాంట్రాక్టర్స్ టెండర్స్ వేయకుండా ఉండడంతో చాల నెలలుగా ఖాళీగా ఉంటున్నారని పేర్కొన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తిరిగి కార్మికుల ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. దీని పై ప్రాజెక్టు సానూకూలంగా స్పందించినట్లు వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామారావు, మురళి, కార్మికులు ఓదెలు, రాజయ్య, రవితేజ, సతీష్, శ్రావణ్, రవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి నీటి వినియోగానికి చెక్

(5వ పేజీ తరువాయి)

తదితర వాణిజ్య, వ్యాపార సంస్థలు ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో కేవలం 45 మాత్రమే ఎన్‌వోసీలు తీసుకున్నారు. పలువురికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. వాటి గడువు ముగిసిన తర్వాత జరిమానాలు విధించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

● ముందుకు రాని వ్యాపారులు..

పరిశ్రమలు, ఇతరత్రా వాణిజ్య, వ్యాపారాల కోసం బోర్లను వినియోగిస్తున్న వాళ్లు భూగర్భ జల శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. సరైన అవగాహన లేని కారణంగా కొందరు, ఉన్నా కూడా తీసుకునేందుకు ముందుకు రాని వారు కొందరు ఉన్నారు. జిల్లాలో 180కి పైగా రైస్ మిల్లులు, 120కి పైగా ఇటుక బట్టీలు,, 50కి పైగా పెట్రోల్ పంపులు, 30కి పైగా ఫంక్షన్ హాళ్లు, అనేక హోటళ్లు, వాటర్ ప్లాంట్లు, చిన్న చిన్న పరిశ్రమలు, ఇతరత్రా డొమెస్టిక్ అవసరాల కోసం అనేక మంది బోర్లు వేసుకుని నీటిని వాడుకుంటున్నారు. వారంతా ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉన్నప్పటికీ తీసుకోవడం లేదు. జీవో జారీ అయి ఇరవై మాసాలు గడుస్తున్నప్పటికీ కేవలం 45 మంది మాత్రమే ఎన్‌వోసీ తీసుకున్నారు. ఈ విషయమై కలెక్టర్ చొరవ తీసుకుంటేనే విచ్చలవిడిగా వినియోగిస్తున్న నీటి వినియోగాన్ని అరికట్ట గలుగుతారు.

ఎన్‌వోసీ తీసుకోని వారికి నోటీసులు జారీ

- గీకురు లావణ్య, జిల్లా భూగర్భ జల శాఖ ఏడీ

జిల్లాలో జీవో 15 అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. జీఓ పరిధిలోకి వచ్చే పరిశ్రమలు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలను గుర్తిస్తున్నాం. పరిశ్రమలను సందర్శించి యజమానులకు ఎన్ఓసీ తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఎన్‌వోసీ తీసుకోని వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. అయినా ఎన్‌వోసీ తీసుకోనట్లయితే జరిమానాలు విధిస్తాం. జిల్లాలో రైసుమిల్లులు, ఇటుక బట్టీల పరిశ్రమలు చాలా ఉన్నాయి. వాటిని సందర్శించి వివరిస్తాం. ప్రభుత్వ నిబంధనలను పాటించాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

సబ్‌స్టేషన్ ఫీడర్లలో లోడ్‌ల బదలాయింపు


సబ్‌స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న ఏఈ మహేందర్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల 33/11 కె.వి సబ్‌స్టేషన్‌లో సోమవారం ఏఈ మహేందర్ పర్యవేక్షణలో ఫిడర్‌లలో విద్యుత్ లోడ్స్ బదలాయింపు చర్యలను చేపట్టారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కల్వచర్ ఫీడర్‌లో ఉన్న అధిక లోడ్‌ను లొంకకేసారం, ముల్కలపల్లి విద్యుత్ ఫీడర్స్‌లకు బదలాయిస్తూ చర్యలు చేపట్టారు. వేసవిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేందుకు సబ్‌స్టేషన్‌లో పనులు చేపట్టినట్లు ఏఈ తెలిపారు. ఏడి, ప్రొటెక్షన్ ఏఈ, స్థానిక లైన్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల నర్సంపేటలో జరిగిన కరాటే టోర్నమెంట్‌లో గోదావరిఖనికి చెందిన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బ్లాక్‌బెల్ట్ కటాస్, కుమితి విభాగాల్లో హేమలత మహజి, స్నేహసుల్తానా, ఎం.ముక్తిశ్రీ బంగారు పతకాలు సాధించగా, కలర్‌బెల్ట్స్ కటాస్‌విభాగంలో పి.రోహన్, డి.అక్షిత్‌రెడ్డి, ఐ శివాష్, కె.కార్తీక, డి.శ్రీవర్షిని, ఎం.కార్తికేయన్, పి.మోహిత్, కీర్తి మహజీ, సిహెచ్ అశ్విన్, ఏ.మనస్విని, సంయుక్త, పవన్‌కుమార్, రిషి వరుణ్, ఎండి.సుహాన్, పి.శ్రీరాజ్ బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. కలర్ బెల్ట్ కుమితి విభాగంలో పి.రోహన్, కీర్తి మహజి, ఎం.కార్తికేయన్, సంయుక్త బంగారు పతకం, ఏ.మనస్విని బంగారు, వెండి పతకాలు సాధించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను, కోచ్ కరాటే శ్రీనివాస్‌ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ శంకర్, సెక్రటరీ రమేష్, సీనియర్ ఇన్‌స్పెక్టర్స్ అభినందించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి పీజీ కళాశాల వలంటీర్


దినేష్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బెంగుళూర్‌లో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ దినేష్ ఎంపికయ్యారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దినేష్ ఈనెల 11వతేది నుంచి 17వ తేది వరకు బెంగళూర్‌లోని శేషాద్రిపురం ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో జరిగే సమైక్యత శిబిరంలో సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించనున్నారు. దినేష్ ఎంపికకావడం పట్ల యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ రవికుమార్, డాక్టర్ మనోహర్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదు

గోదావరిఖని, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం సరైంది కాదని బీఆర్ఎస్ నాయకులు నీరటి శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లో అభివృద్ధి పేరిట షాపులను కూల్చివేస్తూ వారిని బజారున పడవేస్తున్నారని, రామగుండం అభివృద్ధి మేము వ్యతిరేకం కాదని, వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. ఎన్‌టీపీసీలో రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని షాపులు తొలగించారని, ఓల్డ్ అశోక థియేటర్‌ను తొలగించి నిర్మాణాన్ని చేపట్టలేదన్నారు. విలేకరుల సమావేశంలో కల్వచర్ల కృష్ణవేణి, మెతుకు దేవరాజ్, అచ్చె వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, నట్టు శ్రీనివాస్, స్వప్న, రమేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల తమిళనాడులోని మధురైలో జరిగిన 24వ జాతీయస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన గోదావరిఖనికి చెందిన జి.సాయిరిషిక్, జి.అభిరానందన్‌లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ అభినందించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అండర్-10 కెటగిరిలో బంగారు, రజత పతకాలు సాధించిన జి.సాయిరిషిక్, అండర్ 8 విభాగంలో బంగారు, రజత పతకాలు అందుకున్న జి.అభిరానందన్‌లను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పతకాలతో సత్కరించి అభినందించారు.

కరాటే క్రీడాకారులకు బెల్టుల ప్రదానం

జ్యోతినగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన క్రీడాకారులకు సోమవారం బెల్టులను ప్రదానం చేశారు. కృష్ణానగర్‌లోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో షోటోకాన్ కరాటే అసోసియేషన్ జాతీయ చీఫ్ మల్లికార్జున్ గౌడ్ 250 మంది క్రీడాకారులకు వివిధ రకాల బెల్టులు(గ్రేడ్) అందజేశారు. చైర్మన్ సదాశివుడు, టెక్నికల్ డైరెక్టర్ సురేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.